క్లుప్తంగా

మెరుగైన సేవలందించాలి

హుకుంపేట: గ్రామాల్లో ఆశ కార్యకర్తలు గిరిజనులకు నిత్యం అందుబాటులో ఉంటూ సక్రమంగా వైద్య సేవలు అందించాలని వైద్యాధికారి డాక్టర్ మోహన్ సాయిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఆశ కార్యకర్తలకు కిట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతు గ్రామాల్లో గిరిజనులకు నిత్యం అందుబాటులో ఉంటు సక్రమంగా సేవలు అందించాలన్నారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ఆవశ్యకతను తెలియజేయాలన్నారు. వైద్యాధికారులు డాక్టర్ రేఖ, డాక్టర్ సౌమ్య, సిబ్బంది మహేష్, సాంబశివరావు పాల్గొన్నారు.

రింతాడలో వీధి దీపాల ఏర్పాటు


పనులను పరిశీలిస్తున్న ఉప సర్పంచ్ సోమేష్‌కుమార్

గూడెంకొత్తవీధి: మండలంలోని రింతాడ లో సోమవారం వీధి దీపాల ఏర్పాటు పనులు చేపట్టారు. పంచాయతీ సర్పంచ్ బొబ్బిలి లక్ష్మి, కార్యదర్శి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ పనులు జరిగాయి. ఉప సర్పంచ్ సోమేష్‌కుమార్ వీధి దీపాల ఏర్పాటు పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నడిపి పడాల్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణకు ఏర్పాట్లు


అంబేడ్కర్ విగ్రహం వద్ద గ్రామస్తులు

జి.మాడుగుల: మండలంలో నుర్మతి పంచాయతీ కేంద్రంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని గ్రామస్తులు ఏర్పాటు చేశారు. ఈ అంబేడ్కర్ విగ్రహాన్ని జనవరి 26న ఘనంగా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు గ్రామస్తులు నిర్ణయించారు. మైదాన ప్రాంతాల్లో విగ్రహాన్ని తయారీ చేయించి ఇక్కడకు తీసుకొన్ని క్రేన్ సహాయంతో ఏర్పాటు చేశారు. అంబేడ్కర్ విగ్రహాన్ని గ్రామస్తులు పరిశీలించి ఆనందం వ్యక్తం చేశారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు


బోరు ఏర్పాటు పనులు ప్రారంభించిన జెడ్పీటీసీ శివరత్నం, ఎంపీపీ కుమారి

గూడెంకొత్తవీధి: గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని గూడెంకొత్తవీధి జెడ్పీటీసీ సభ్యురాలు కిముడు శివరత్నం అన్నారు. దామనాపల్లి పంచాయతీ గొడుగుమామిడి గ్రామంలో జెడ్పీటీసీ నిధులతో బోరు నిర్మాణ పనులను ఆమె సోమవారం ప్రారంభించారు. ఎంపీపీ బోయినకుమారి, సర్పంచ్ కుందరి రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, ఎంపీటీసీ సభ్యుడు భీమరాజు, ఉప సర్పంచ్ చిలకమ్మ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు


పూజలు చేస్తున్న భక్తులు

సీలేరు: స్థానిక రామాలయంలో సోమవారం భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు దామోదరం ఆధ్వర్యంలో భక్తులతో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆకాశదీపాన్ని వెలిగించారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ ప్రత్యేక చర్యలు తీసుకుంది.

నిర్లక్ష్యానికి దర్శనం

- అందుబాటులోకి రాని బోడకొండమ్మ పర్యాటక కేంద్రం
- అసంపూర్తిగా రహదారి నిర్మాణం
- అలంకారప్రాయంగా వ్యూపాయింట్
- అందుబాటులోకి తీసుకురావాలని పర్యాటకుల వినతి


బోడకొండమ్మ ఆలయం వద్ద అలంకార ప్రాయంగా ఉన్న వ్యూ పాయింట్


అసంపూర్తిగా దర్శనమిస్తున్న సిమెంట్ రోడ్డు

చింతపల్లి: పర్యాటక అభివృద్ధికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో లక్షలాది రూపాయలు వెచ్చించారు. పర్యాటక ప్రదేశాల్లో మరిన్ని అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేసినా, ఎన్నికల కోడ్ కారణంగా పనులు నిలిచిపోయాయి. ఎన్నికల అనంతరం కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మన్యంలో ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మంజూరైన నిధులతో పర్యాటక ప్రాంతాల్లో ఏ విధమైన అభివృద్ధి చేయలేదు. దీంతో పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం సీజన్ కావడంతో మన్యంలో ఏ సందర్శిత ప్రదేశం చూసినా పర్యాటకులతో కళకళలాడుతున్నాయి.

లంబసింగి వ్యూపాయింట్‌లో కానరాని పనులు

సముద్ర మట్టానికి 3600 ఎత్తులో ఉన్న లంబసింగి ప్రాంతంలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయి.దీంతో ఈ ప్రాంతం ఆంధ్రా కశ్మీరుగా పేరుగాంచింది. ఈ ప్రాంతంలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో పాటు పాల సముద్రాన్ని తలపించే పర్యాటకులను మంత్రముగ్ధులను చేసే ప్రాంతాలు ఎన్నో ఉన్నా వాటిలో ముఖ్యంగా చెరువుల వేనం ,బోడకొండమ్మ వ్యూపాయింట్‌లు ఉన్నాయి. లంబసింగి పంచాయతీ పరిధిలో అతి ఎత్తైన కొండపై మంచు ముసుగులో పాల సముద్రాన్ని తలపించే చెరువులవేనం వ్యూపాయింట్‌కు పర్యాటకులు క్యూకడుతుంటారు. లంబసింగి పంచాయతీ కేంద్రం నుంచి కాఫీ తోటలు మధ్యలో రాళ్లు తేలిన మార్గంలో కాలినడకన వ్యయ ప్రయాసలతో వ్యూపాయింట్‌కు చేరుకొనేవారు. దీంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.20లక్షలు వెచ్చించి చెరువుల వేనంలో వ్యూపాయింట్ నిర్మాణం చేపట్టడంతో పాటు భీమనాపల్లి నుంచి రాకపోకలకు వీలుగా రహదారి నిర్మాణాన్ని చేపట్టింది. దీంతో పర్యాటకులు రద్దీ బాగా పెరగడంతో ఐటీడీఏ అనుమతులతో పర్యాటకుల నుంచి పంచాయతీ రుసుము వసూలు చేయడం ప్రారంభించింది. గడిచిన రెండేళ్లుగా వసూలు చేసిన సొమ్ములో 30 శాతం స్థానిక పంచాయతీకి చెల్లించి మిగిలిన 70 శాతం సొమ్మును గ్రామ కమిటీ ఆధ్వర్యంలో గ్రామాభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. పర్యాటకుల ద్వారా గతేడాది సుమారు రూ.3 లక్షలు వసూలు అయినట్లు గ్రామ కమిటీ సభ్యులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.40లక్షలతో వ్యూపాయింట్ నిర్మాణం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో పర్యాటక అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా అప్పటి ఎంపీ గొడ్డేటి మాధవి ఎంపీ నిధుల నుంచి రూ.40 లక్షలను లంబసింగి ఘాట్ రోడ్‌లో బోడకొండమ్మ ఆలయం వద్ద వ్యూపాయింట్ నిర్మాణానికి వెచ్చించారు. దీంతో ఇక్కడ ఆలయం ఎదుట పెద్ద ఆర్చ్, టికెట్ కౌంటర్, మహిళలకు మరుగుదొడ్లుతో పాటు ఎంతో ఆకర్షణీయమైన వ్యూపాయింట్ నిర్మాణాన్ని చేపట్టారు. దీంతో పాటు వ్యూపాయింట్ వెళ్లడానికి, వాహనాలు నిలుపుదల చేసుకోవడానికి వీలుగా అమ్మవారి ఆలయం వెనుక బాగాన కొండను చదును చేసారు.ఈ ఆప్రాంతంలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ఎన్ఆర్ఇజిఎస్ ద్వారా 40 లక్షలు నిదులు మంజూరు అయ్యాయి.దానిలో బాగంగా రూ.5 లక్షలుతో ఆలయం వెనుక బాగాన కొంతమేర సీసీ ర్యాంప్ నిర్మాణం చేపట్టారు.ఈ వ్యూపాయింట్ చూసేందుకు వెళ్లే పర్యాటకులు నుంచి పెద్దలకు రూ.30, పిల్లలకు రూ.20 వసూలు చేసి స్థానికులకు ఉపాధి కల్పించాలని పంచాయతీ గ్రామసభ్యులు భావించారు. అయితే ఈ వ్యూపాయింట్ వద్ద రుసుము తీసుకుని పర్యాటకులను పంపే విధంగా ఎటువంటి చర్యలు చేపట్టక పోవడంతో యువత ఎటువంటి ఉపాధి పొందే అవకాశం లేకుండా పోతుంది. ముఖ్యంగా ఇక్కడి వ్యూ పాయింట్‌కు క్యూలో వెళ్లేలా బారికేడ్లు వంటివి నిర్మించలేదు. దీంతో పర్యాటకులు ఇష్టానుసారంగా వ్యూపాయింట్‌కు వెళ్తున్నారని పలువురు స్థానికులు చెబుతున్నారు.


నిరుపయోగంగా ఉన్న టికెట్ కౌంటర్

అసంపూర్తి పనులతో అవస్థలు

ఈ వ్యూపాయంట్‌కు వెళ్లడానికి వాహనాలు నిలుపుదలకు వీలుగా ఆలయం వెనుక భాగాన ఏర్పాటు చేసిన సిమెంటు ర్యాంప్ నిర్మాణం అసంపూర్తిగా ఉంది. ఈ ఆలయం నుంచి వ్యూపాయంట్‌కు వెళ్లే మార్గం కూడా రాళ్లు తేలి ఉంది. ఈ వ్యూపాయింట్‌కు పక్కాగా ఎటువంటి కంచె ఏర్పాటు చేయక పోవడంతో ప్రస్తుతం ఆలయానికి వచ్చిన భక్తులు మాత్రమే కాకుండా ఈ ప్రాంతం మీదుగా వెళ్లే పర్యాటకులు ఏ మాత్రం రుసుము చెల్లించకుండానే వ్యూపాయింట్ అందాలను ఆస్వాదిస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. దీంతో ఇక్కడ ఉన్నటువంటి నిరుద్యోగ యువతకు ఎటువంటి ఉపాధి పొందే అవకాశం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

యువతకు ఉపాధి లేదు

యువతకు ఉపాధి లేకుండా పోయింది. లంబసింగి ఘాట్ రోడ్డులో బోడకొండమ్మ ఆలయం వద్ద వ్యూపాయింట్‌కు కంచె ఏర్పాటు చేయాలి. ఎటువంటి కంచె ఏర్పాటు లేకపోవడం వలన ఏ రుసుము చెల్లించకుండానే వ్యూపాయింట్ అందాలను పర్యాటకులు ఆస్వాదిస్తున్నారు.దీంతో స్థానిక యువత ఉపాధి అవకాశం లేకుండా పోతుంది.

– కొర్రా రఘునాథ్, మాజీ సర్పంచ్, లంబసింగి

రోడ్డును పూర్తి చేయాలి

బోడకొండమ్మ ఆలయం వద్ద అందమైన ప్రదేశంలో వ్యూపాయింట్ నిర్మాణం చేపట్టారు. ఇక్కడ రోడ్డు సరిగా లేకపోవడంతో వ్యూపాయింట్‌కు వెళ్లేందుకు , వాహనాలు నిలుపుదలకు ఇబ్బందికరంగా ఉంది. ఇక్కడ అసంపూర్తిగా ఉన్న రోడ్డును పూర్తి చేసే దిశగా చర్యలు చేపట్టాలి.

– నూకరాజు, స్థానికుడు, లంబసింగి

తొలగించిన హెల్త్ అసిస్టెంట్‌లను విధుల్లోకి తీసుకోవాలి

డుంబ్రిగుడ: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న హెల్త్ అసిస్టెంట్‌లను తొలగించిన వారిని తక్షణమే విధులలోకి తీసుకోవాలని జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షుడు ఎస్.బి పోతురాజు డిమాండ్ చేశారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ సుమారు గత 20 ఏళ్లుగా స్థానికు పీహెచ్‌సీలో పనిచేస్తున్న హెల్త్ అసిస్టెంట్లను రాష్ట్ర ప్రభుత్వం అన్యాయంగా తొలగించడం సరికాదన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో సుమారు 270 మంది హెల్త్ అసిస్టెంట్‌లున్నారన్నారు. వారంతా సుమారు రెండు దశాబ్దాలకు పైగా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. వారిని విధుల్లో తొలగించడంతో ఆయా కుటుంబీకులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు అయిన, ఔట్‌సోర్సింగ్ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న చిన్న ఉద్యోగస్తులైన వారిని కొనసాగించాలి తప్ప అకస్మాత్తుగా తొలగించడం భావ్యం కాదని చెప్పారు. ఉద్యోగాల మీద ఆధారపడి బతుకుతున్న వారి కుటుంబీకులు రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ స్పందించి తక్షణమే తొలగించిన హెల్త్ అసిస్టెంట్‌లను విధుల్లో కొనసాగించే విధంగా నియామక చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. గిరిజన సంఘం నాయకుడు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం


భయ్యనపల్లిలో స్థానికులకు అవగాహన కల్పిస్తున్న సీఐ నరసింహమూర్తి

గంగవరం: భయ్యనపల్లి గ్రామాన్ని అడ్డతీగల సీఐ బి.నరసింహమూర్తి సోమవారం సందర్శించారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పరివర్తన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాలకు (డ్రగ్స్) యువత దూరంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. యువత ఉన్నత చదువులపై దృష్టి సారించాలన్నారు. గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరమని వాటికి దూరంగా ఉండాలన్నారు. వన్యప్రాణుల వేట కోసం విద్యుత్ తీగల ఏర్పాటుచేస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఎస్ఐ భూషణం, సర్పంచ్ పార్వతి, మహిళా సంఘం నాయకులు నీలాలమ్మ , హెచ్‌సీ రాంబాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులపై ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు


మాట్లాడుతున్న గిరిజన సంఘం మండల అధ్యక్షుడు శ్రీను

ముంచంగిపుట్టు: గిరిజన గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులపై కూటమీ ప్రభుత్వం నిర్లక్ష్యం తగదని గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎం.ఎం.శ్రీను అన్నారు. మండల కేంద్రంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. గత 15ఏళ్లకు పైబడి చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న గురుకుల ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు తగదని ధ్వజమెత్తారు. తక్షణమే వారి న్యాయపరమైన సమస్యలు పరిష్కరించి, కనీస వేతనాలు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. నేతలు గాసిరాందొర, నర్సింగరావుపడాల్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


మోహిని కుటుంబానికి ఆర్థిక సాయమందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

ముంచంగిపుట్టు: మండలంలోని భూసిపుట్టు గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న గెమ్మెలి మోహిని(32)ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే.ఈ సందర్భంగా మండలంలో 18 గ్రామ సచివాలయ ఉద్యోగులు మృతురాలు మోహిని కుటుంబానికి ఆర్థిక సాయమందించారు. మండల సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సాయికుమార్, ప్రధాన కార్యదర్శి మనోజ్, ఉద్యోగులు, సర్పంచ్ శివశంకర్ సమక్షంలో సోమవారం కిలగాడ గ్రామానికి వెళ్లి రూ.25వేలను కుటుంబ సభ్యులకు అందించారు. మండల సచివాలయ సంఘం అండగా ఉంటుందని మృతురాలి కుటుంబసభ్యులకు వారు చెప్పారు.

శరభన్నపాలెంలో ధాన్యం కొనుగోలు కేంద్రం


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏవో ఉమాదేవి తదితరులు

కొయ్యూరు: మండలంలోని శరభన్నపాలెం రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం తేమశాతం 17కు మించకుండా ఉండేలా చూసుకొని తీసుకురావాలని సూచించారు. కొనుగోలు కేంద్రం సిబ్బంది సూచనలు, సలహాలను రైతులు విధిగా పాటించాలని కోరారు. ధాన్యంకు సంబంధించి కనీస మద్దతు ధరను క్వింటాకు రూ.2,300లుగా నిర్ణయించినట్లు తెలిపారు. సర్పంచ్ కిముడు సత్యనారాయణ, స్థానికులు, వ్యవసాయ సిబ్బంది సత్తిబాబు, మాధవి పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు


రైతులతో మాట్లాడుతున్న డీజీఎం ప్రకాశ్

రాజవొమ్మంగి: ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తు ప్రభుత్వం అనేక రాయితీలు ఇస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకొని లాభాలు పొందాలని పెద్దపురం ఆయిల్‌పామ్ కంపెనీ డీజీఎం ఎ.ఎస్. ప్రకాశ్ అన్నారు. మండలంలోని చికిలింత గ్రామంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయిల్‌పామ్ సాగు వల్ల కలిగే లాభాలను వివరించారు. ఆయిల్ పామ్ సాగుతో సిరులు పండించవచ్చన్నారు. సాగును ప్రోత్సహిస్తు పలు సూచనలు చేశారు. సాగుకు అవసరమైన మొక్కలను తమ సంస్థ ఉచితంగా ఇస్తుందని, సాగులో అవసరమైన పలు ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందజేస్తోందన్నారు. ఫీల్డ్ ఆఫీసర్ దుర్గాప్రసాద్, క్లస్టర్ ఆఫీసర్ చక్రబాబు, రైతులు పాల్గొన్నారు.

షేక్ సాబ్జి సేవలు మరువలేనివి


సాబ్జి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న నాయకులు

డుంబ్రిగుడ: మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో షేక్ సాబ్జి ప్రథమ వర్ధంతిని సోమవారం యూటీఎఫ్ మండల అధ్యక్షుడు శెట్టి బాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎస్.కన్నయ్య పాల్గొని మాట్లాడారు. యూటీఎఫ్ గౌరవ అధ్యక్షుడిగా, 2021లో జరిగిన ఉభయ గోదావరి ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నికైన షేక్ సాబ్జి ఉపాధ్యాయుల సమస్యలపై ఎనలేని పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఉపాధ్యాయ వర్గానికి ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. మండల కార్యదర్శి మోహన్, మేఘనాథ్, జాకీరు రాజ్‌కుమార్, శ్రవణ్, దుక్కు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు

గూడెంకొత్తవీధి: పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఐదేళ్లలోపు చిన్నారులందరికీ ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు సోమవారం తెలిపారు. పూజారిపాకలు అంగన్‌వాడీ కేంద్రం, రింతాడ సచివాలయాల్లో ఈనెల 17నుంచి 20 వ తేదీ వరకూ, 26 నుంచి 28వ తేదీ వరకూ ఆధార్ నమోదు కార్యక్రమాలు చేపడతామన్నారు. ఐదేళ్లలోపు చిన్నారుల ఆధార్ నమోదు అప్‌డేట్, బయోమెట్రిక్ వంటి సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

రెవెన్యూ సదస్సుల్లో వెల్లువెత్తిన వినతులు


కొయ్యూరులో తహసీల్దార్ ప్రసాద్‌కు సమస్యలపై ఫిర్యాదు చేస్తున్న రైతులు

పాడేరురూరల్(అరకులోయరూరల్)/డుంబ్రిగుడ/కొయ్యూరు/గంగవరం: అరకులోయ మండలంలోని మినుములూరు, వంట్లమామిడి గ్రామాల్లో సోమవారం తహసీల్దార్ వంజంగిత్రినాథరావు ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో పలువురు గ్రామస్తులు భూ సమస్యలపై వినతులు ఇచ్చారు. వివిధ సమస్యలపై 48 ఫిర్యాదులు వచ్చినట్టు తహసీల్దార్ త్రినాథరావు చెప్పారు. డుంబ్రిగుడ మండలంలోని కొల్లాపుట్టు పంచాయతీ బిట్రగండ, కూడలో, సొవ్వా పంచాయితీ దేముడువలస గ్రామాల్లో రెవెన్యూ సదస్సును ఇన్‌చార్జి తహసీల్దార్ ముజీబ్ నిర్వహించి, స్థానిక సమస్యలపై గ్రామస్తుల నుంచి వినతులు స్వీకరించారు. కొయ్యూరు మండల కేంద్రంలో తహసీల్దార్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో స్థానిక రైతులు తమకు చెందిన ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలను జిరాయితీ పట్టాలుగా మార్చాలని కోరుతూ వినతిలిచ్చారు. డీటీ కుమరస్వామి, సర్పంచ్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు. గంగవరం మండలం సూరంపాలెంలో తహసీల్దార్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో భూసమస్యలపై అర్జీలు స్వీకరించారు. సర్పంచ్ శివదొర పాల్గొన్నారు.

పాలసీదారులకు మెరుగైన సేవలు

గంగవరం: మండల కేంద్రంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఏలేశ్వరం శాటిలైట్ ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ ఎం.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఏలేశ్వరం శాటిలైట్ ఎల్ఐసీ బ్రాంచి సింగల్ ప్రీమియం బడ్జెట్‌లో 75.49శాతం సాధించినట్టు చెప్పారు. పాలసీదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్టు ఆయన స్పష్టం చేశారు. ఏజెంట్లు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

కూనవరం: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ పాయం రంగమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.ఆర్.విజయ సోమ వారం తెలిపారు. ఈ సమావేశానికి జెడ్పీటీసీ గుజ్జా విజయ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, తహసీల్దార్, కార్యదర్శులు, వీఆర్‌ఓలు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. గైర్హాజరైన వారి వివరాలను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు.

సమస్యలపై పీవోకు వినతి


ఐటీడీఏ పీవో అభిషేక్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

పాడేరురూరల్(అరకులోయరూరల్): ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల ప్రధాన డిమాండ్‌లను పరిష్కరించాలని కోరుతూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు రత్నాకర్ తదితరులు సోమవారం పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ల్లో ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయ, అధ్యాపకుల న్యాయపరమైన డిమాండ్‌లను పరిష్కరించాలని కోరుతు పాడేరు జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న నిరసన దీక్ష నేటికి 31రోజులకు చేరిందన్నారు. ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయ, అధ్యాపకులు సమస్యలను కూటమి ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని పీవో అభిషేక్‌ను కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్టు రత్నాకర్ చెప్పారు. నాయకులు కొండబాబు, వెంకటేశ్వర్లు, శేఖర్, సురేష్, భవానిలక్ష్మి, హేమ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి


కుతుడ పాఠశాలలో రికార్డును పరిశీలిస్తున్న ఎంఈవో కృష్ణమూర్తి

ముంచంగిపుట్టు: పాఠశాలలో చదువులో వెనకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంఈవో కె.కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని జోలాపుట్టు, మాకవరం, పనసపుట్టు పంచాయతీల్లో కుతుడ, కడుతుల, అరబీరు, కెందుపుట్టు, లబడపుట్టు గ్రామాల్లో పాఠశాలలను ఆయన సోమవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి వర్క్ పుస్తకాలను పరిశీలించి, తప్పులను సరిదిద్దారు. గణితం పాఠాన్ని బోధించారు. పలుప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థుల ఆన్‌లైన్ హాజరు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధంచాలని, బడి బయట పిల్లలు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని, మధ్యాహ్న భోజనాన్ని పక్కాగా అమలు చేస్తూ నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని ఎంఈవో కృష్ణమూర్తి ఉపాధ్యాయులకు సూచించారు. లబడపుట్టు గ్రామంలో పాఠశాలకు భవనం లేక పోవడం, పాకలో తమ పిల్లల చదవులు కొనసాగుతున్నాయని ,వెంటనే భవనం మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈవో కృష్ణమూర్తిని కోరారు.దీనిపై ఆయన స్పందించి భవన సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తానని గ్రామస్తులకు తెలియజేశారు. సీఆర్‌పీ హరి, ఉపాధ్యాయలున్నారు.

పంచాయతీల అభివృద్ధికి సహకరించాలి


రాజవొమ్మంగిలో మాట్లాడుతున్న ఎంపీడీవో యాదగిరీశ్వరరావు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలో ఎంపీపీ సమావేశ మందిరంలో పంచాయతీల అభివృద్ధి–ప్రణాళికపై ఒక రోజు శిక్షణ తరగతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధిలో ప్రతి ఒక్కరు పాలు పంచుకోవాలని కోరారు. అనంతరం ఎంపీడీవో యాదగిరీశ్వరరావు మాట్లాడుతూ నిబంధనలకు అనుగుణంగా గ్రామీణాభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.


గంగవరంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ

గంగవరం: మండల కేంద్రంలో ఎంపీడీవో రామకృష్ణ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై ప్రజాప్రతినిధులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ కృషారెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఎంపీడీవో రామకృష్ణ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక పై సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు దృష్టి సారించాలన్నారు. వైస్ ఎంపీపీ కుంజం గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు వేగవంతం


మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

చింతపల్లి: మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో అనుకున్న లక్ష్యాన్ని చేరువయ్యే విధంగా పనులు చేపట్టాలన్నారు. సోషల్ ఆడిట్‌లో అన్ని రికార్డులను సరిచూసుకోవాలన్నరు. ఉపాధి ఏపీడీ లోకేష్, ఏపీవో రాజుబాబు, పీఆర్ జేఈ బాలకిషోర్ టీఏలు, వీఆర్‌పీలు పాల్గొన్నారు.